నవతెలంగాణ

నమ్మగిన తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

గురువారం | ఏప్రిల్ 03, 2025 | www.navatelangana.com

సీపీఐ(ఎం) జాతీయ మహాసభలకు ఆదిలాబాద్ వాసి

- ఎంపికైన పూసం సచిన్‌కు అభినందనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఏప్రిల్ 2 నుండి 6 వరకు తమిళనాడు రాష్ట్రం మదురైలో జరుగుతున్న సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పూసం సచిన్ ప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి దశాబ్దం తర్వాత అవకాశం ప్రతినిధిగా అవకాశం వచ్చింది. పార్టీలో అత్యున్నతంగా భావించే అఖిల భారత మహాసభలకు పూసం సచిన్ ప్రతినిధిగా ఎన్నిక కావడం పట్ల సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి, సీనియర్ నాయకులు లంక రాఘవులు, నాయకులు స్వామి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బోథ్

సొనాల మండలం సాకేర గ్రామానికి చెందిన రిపోర్టర్ రాథోడ్ దేవిదాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డ గంగారెడ్డి, అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బాధిత కుటుంబానికి వేర్వేరుగా పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, పీఏసీఎస్ డైరెక్టర్లు గొల్ల రాజు, అబ్రాహార్, మైనార్టీ నాయకులు రైముద్దీన్, అబుద్ ఉన్నారు.



ప్రమాద ఘంటికలు..!

- డెడ్‌స్టోరేజ్‌కు చేరుకుంటున్న ప్రాజెక్టులు
- ప్రమాదకర స్థాయికి భూగర్భజలాలు
- రానున్న రోజుల్లో మరింత దుర్భిక్ష పరిస్థితులు
- సాగు, తాగునీటికీ ఇబ్బందులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఇప్పటికే ప్రమాదకర స్థాయికి చేరుకోగా.. రానున్న రోజుల్లో మరింత దుర్భిక్ష పరిస్థితులు తలెత్తే పరిస్థితి. ఈ క్రమంలో జలాశయాలు వట్టిపోతున్నాయి. వేసవి ఆరంభం కాగానే ప్రాజెక్టుల్లో నీరు అడుగంటగా.. మార్చి నెల వచ్చే సరికి మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా యాసంగి సాగుకు పూర్తిస్థాయిలో నీరందించడం కష్టంగా మారనుంది. సాగు, తాగు నీటి అవసరాలకు చుక్క చుక్క వడిసి పట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రాజెక్టుల్లో నీటిమట్టం తగ్గిపోతుండటంతో మిషన్ భగీరథ ద్వారా తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులు డెడ్‌స్టోరేజ్‌కు చేరుకున్నాయి. కడెం వంటి ప్రధాన ప్రాజెక్టు నుంచి వారం రోజులకోసారి పంటలకు నీటిని సరఫరా చేయాల్సి వస్తుండగా.. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రం కానుందని తెలుస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జలాశయాల్లో నీటి నిల్వలు క్రమంగా పడిపోతున్నాయి. ఎండల తీవ్రతకు నీరంతా భూగర్భంలోకి వెళ్లిపోతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన జలాశయాలు వట్టిపోతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోపక్క ఆయా ప్రాజెక్టుల నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలకు వినియోగమవుతున్నాయి. కడెం, కుమురంభీం (అడ), సాత్నాల, మత్తడివాగు, గడ్డెన్నవాగు, స్వర్ణ తదితర ప్రాజెక్టులు ఎండిపోయే దశలో ఉన్నాయి. కడెం ప్రాజెక్టు నీటి సామర్థ్యం 7.69 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.91టీఎంసీలకు చేరుకుంది. ఈ ప్రాజెక్టు కింద 68,150 ఎకరాల ఆయకట్టు ఉండగా.. రెండు తడులకు నీరు అవసరం కానుంది. అధికారులు మాత్రం ఒకే తడికి నీటిని అందించే ఆస్కారం ఉందని చెబుతున్నారు. ఇదే ప్రాజెక్టు నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు తాగు నీటిని కూడా అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గిపోవడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. కుమురంభీం ప్రాజెక్టు నీటి సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా.. ప్రసుత్తం 5.049టీఎంసీలకు చేరుకుంది. సాత్నాల ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.24టీఎంసీలు కాగా 0.220టీఎంసీలకు పడిపోయింది. మత్తడివాగు ప్రాజెక్టు 0.571టీఎంసీలు కాగా 0.173టీఎంసీలుగా ఉంది. గడ్డెన్నవాగు నీటి సామర్థ్యం 1.852టీఎంసీలు కాగా.. 0.905టీఎంసీలు ఉంది. ఇలా ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గిపోతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

అడుగంటిన భూగర్భజలం..!

రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే నమోదవుతున్నాయి. మార్చి నెలలో 41డిగ్రీలపైనే నమోదు కాగా.. ఏప్రిల్‌లో మరింత తీవ్రరూపం దాల్చనున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భూగర్భజలాలు 10మీటర్ల లోతులకు వెళ్లిపోవడంతో.. స్థానిక తాగునీటి వనరులైన చేతిపంపులు, బావులు, వాగులు, వంకలు అడుగంటిపోయాయి. చెరువులు క్రీడా మైదానాలుగా మారాయి. బోర్ల నుంచి కూడా నీరు రాకపోవడంతో రైతులు మొక్కజొన్న, జొన్న తదితర పంటలను అర్ధాంతరంగా వదిలేస్తున్నారు. మరోవైపు చాలా గ్రామాల్లో భగీరథ నీరు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న పరిస్థితి.



డెడ్ స్టోరేజీలో మత్తడివాగు ప్రాజెక్టు



ఎండిపోయిన ప్రాజెక్టు పరిసరాలు

15వ రోజు సీసీఐ దీక్షలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం దీక్షలు 15వ రోజుకు చేరుకోగా వ్యవసాయ కార్మిక సంఘం, బీఆర్ఎస్ నాయకులు కూర్చుకున్నారు. వీరికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్ పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీసీఐ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఫ్యాక్టరీ పునరుద్ధణకు రెండు వేల కోట్లను కేటాయించాలని, దీనికి ఎంపీ కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, బీఆర్ఎస్ బీసీ విభాగం పట్టణ అధ్యక్షుడు దాసరి రమేష్, పొచ్చక్క, ఆరిఫా, ఈరన్న, గంగయ్య, హన్మండ్లు, అశోక్, దాసరి రవీందర్, ఎస్.స్వామి, ఆశన్న, గంగారాం, అశోక్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలి



నవతెలంగాణ-మంచిర్యాల

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపి విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, యుఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్‌సియులో జరుగుతున్న ఆందోళనలకు సంఘీభావంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలన చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం గురించి గళం విప్పే గొంతుకలపై కత్తులు పెట్టి అణచివేసే ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. అభివృద్ధి పేరిట ప్రకృతిని నాశనం చేస్తూ జీవహింసకు పాల్పడుతోందన్నారు. బూటకపు కేసులతో విద్యార్థులను బెదిరించాలని ప్రయత్నం చేస్తే భయపడేది లేదని, రెట్టింపు ఉత్సాహంతో యూనివర్సిటీ భూముల రక్షణకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్, యుఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు సుమంత్, సికిందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల వాసి మృతి

నవతెలంగాణ-మంచిర్యాల



హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల పట్టణానికి చెందిన వ్యాపారవేత్త అందె విజయ్(53) మృతి చెందాడు. రామ్‌నగర్‌లో నివాసం ఉండే ఈయన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి మంచిర్యాలకు వచ్చే క్రమంలో బుధవారం ఉదయం ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణిస్తున్న కారును వెనుక నుండి లారీ ఢీకొంది. దీంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పలువురికి గాయాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడుకి భార్య మంగ ఇద్దరు పిల్లలు దిశ, ప్రజ్వల ఉన్నారు. భార్య మంగ ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. విజయ్ మృతి పట్ల సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు సంతాపం తెలిపారు.

కలెక్టర్ టెన్త్ పరీక్షా కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

పదవ తరగతి పరీక్షల చివరి రోజైన బుధవారం మామడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా లేదా నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా లేదా అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా పరీక్షలు జరగాలన్నారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారి పరుశురాం, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రికి వినతి

- సీసీఐని ప్రారంభించాలని సాధన కమిటీ అభ్యర్థన
- సానుకూలంగా స్పందించిన మంత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మలిదశ ఉద్యమంలో భాగంగా కమిటీ సభ్యులు ఢిల్లీలో బుధవారం మాజీ మంత్రి జోగు రామన్న, రాజ్యసభ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సురేష్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు దామోదరరావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పరిశ్రమ, ముడిసరుకు గురించి ఆయనకు వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిమెంట్ పరిశ్రమ విషయంలో కేంద్రానికి అనేకసార్లు విన్నవించడం జరిగిందని తెలిపారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, మాజీ అటవీ శాఖ మంత్రి జోగు రామన్న అనేకసార్లు ఢిల్లీకి వచ్చి నాటి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిని కలిశారని పేర్కొన్నారు. సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని, 2018 ఎన్నికల్లో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేగా ఎన్నికల్లో గెలిపిస్తే ప్రారంభిస్తామని అమిత్ షా, మోడీ, హన్సరాజ్ గంగారాం హయరే హామీ ఇచ్చారన్నారు. సీసీఐ ప్రారంభం కోసం జిల్లా ప్రజలు, సాధన కమిటీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం పాటుపడుతూ సీసీఐని తిరిగి ప్రారంభించాలని కోరారు. అనేక మందికి ఉపాధి దొరుకుతుందని విన్నవించారు. దీనికి మంత్రి స్పందించి మాట్లాడుతూ తనకు కొంత సమయం ఇవ్వాలని అన్నారు. తప్పకుండా పరిశ్రమ తిరిగి ప్రారంభించడానికి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీసీఐ సాధన కమిటీ బృందంతో మంత్రి అరగంట ఓపికగా విని సానుకూలంగా స్పందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో - కన్వీనర్ విజ్జగిరి నారాయణ, అరుణ్ కుమార్, గుడిపెల్లి నగేష్, లోకారి పోశెట్టి, కొండ రమేష్, భామస్ జగన్, సిర్ర దేవేందర్, వెంకటనారాయణ, బొజ్జ ఆశన్న, దర్శనాల నగేష్, మనోజ్ పాల్గొన్నారు.



కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



నవతెలంగాణ-మంచిర్యాల

చట్ట విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో మంగళవారం అర్ధరాత్రి పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక పోలీసులకు సమస్య తెలిపినప్పుడు ఎలా ప్రతిస్పందిస్తున్నారని, భద్రత పరమైన విషయాలపై, పోలీసుల పనితీరుపై అక్కడి ప్రజలను కనుక్కున్నారు. గతంలో ఈ కాలనీలో ఉన్న రౌడీషీటర్స్, సస్పెక్ట్ షీట్స్ ప్రస్తుత పరిస్థితి, జీవన విధానం గురించి అక్కడి వాళ్లతో మాట్లాడారు. ప్రజా జీవనానికి భంగం కలిగిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై నిఘా, నియంత్రణలో భాగంగా తిలక్‌నగర్‌లోని అనుమానాస్పద ప్రాంతాలను, ఇండ్లను నార్కోటిక్ డాగ్‌లతో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను పరిశీలించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ , సీఐలు ప్రమోద్‌రావు, ఆకుల అశోక్, అల్లం నరేందర్, నరేష్ కుమార్, పలువురు ఎస్ఐ పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

- 7 నుండి మూల్యాంకనం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదవ తరగతి వార్షిక పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 10050 మంది విద్యార్థులకు 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం చివరగా సాంఘిక శాస్త్రం పరీక్ష ఆటంకాలు లేకుండా ముగిసింది. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష కేంద్రాల నుండి బయటకు వచ్చారు. విజయ సంకేతం చూపిస్తూ ఇంటికి పయనమయ్యారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. ఈసారి సైతం విద్యార్థులకు 5 నిమిషాల వరకు సడలింపు నివ్వగా.. ఉదయం 9.35 తరువాత ఎవరినీ పరీక్షా కేంద్రాలకు అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. అటు ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచడంతో పాటు అత్యవసర వైద్యం కోసం ఏఎన్ఎంను నియమించారు. చివరి రోజు పరీక్షకు 10వేల23 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. మూల్యాంకనం ఈ నెల 7 నుంచి ప్రారంభం కానుంది.

కలెక్టరేట్‌లో పాపన్నగౌడ్ వర్ధంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరై పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న చేసిన సేవల గురించి కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, బిసి వెల్ఫేర్ అధికారి రాజలింగు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని సోమగూడెం చౌరస్తాలో బుధవారం గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 315వ వర్ధంతి నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బైరగోని సిద్ధయ్య ఉపాధ్యక్షులు సుధాకర్, కార్యదర్శి తోడేటి కృష్ణ, యువ నాయకులు ప్రశాంత్, సాయి ప్రకాశ్, రామ్, హేమంత్, సుమంత్ పాల్గొన్నారు.



కాసిపేట లో..

ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేసి 100 శాతం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి పనుల పురోగతి, ఎంబి రికార్డులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు మంజూరైన సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో 100 శాతం పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన గుత్తేదారులు, ఏజెన్సీలు పనులు పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితులలో అసంపూర్తిగా ఉండకూడదని పేర్కొన్నారు. పనులు పూర్తయిన వాటికి సంబంధించి ఫొటోలు, వివరాలతో ఎంబి రికార్డులు సిద్ధం చేసి డీఈఈలు, ఏఈఈలు పనులు పూర్తి అయినట్లుగా ధ్రువపత్రం అందజేయాలని తెలిపారు. ఈ నెల 5లోగా పనులు పూర్తిచేసి ఎంబి రికార్డులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డివిజన్ల వారీగా పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ దత్తారావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-కడెం

మండలంలోని లింగాపూర్ శాంతినికేతన్ విద్యాలయం నుంచి రుక్మాపూర్ సైనిక్‌స్కూల్, గురుకుల పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో



ఘనంగా సత్కరించి, స్వీట్స్ తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఇలాగే ఉన్నత చదువులలో మరెన్నో ర్యాంకులు సాధించి మంచి ఉద్యోగాలు సాధించాలని, విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నిషిత, పాఠశాల హెచ్‌ఎం పద్మాకర్, ఉపాధ్యాయులు పరమేశ్వర్, వెంకటేశ్వర్, మహేష్, సంయుక్త, శైలజ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

నవతెలంగాణ-ఉట్నూర్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని గంగన్నపేట కాలనీలో కొత్త మహేందర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని



ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు మండలవాసుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషా



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వార అందిస్తున్న సన్న బియ్యాన్ని తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం మండలంలోని భరంపూర్ గ్రామంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, సుంకిడిలో కలెక్టర్ రాజర్షిషా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా లబ్దిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని వినియోగించుకొని, ఆరోగ్యంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో వసతి గృహాలలో సన్న బియ్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. అనంతరం రేషన్ డీలర్ రమేష్‌ను గ్రామంలో ఎంతమంది రేషన్ కార్డు లబ్దిదారులు ఉన్నారని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని అమ్ముకోకుండా సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఎం సుధా, డీఎస్‌ఓ మహమ్మద్ వాజిద్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రవీందర్, సుంకిడి, భరంపూర్ గ్రామాల కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : పేద వారి కడుపు నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సన్నబియ్యం పంపిణీని ప్రజలు సద్వినియోగించుకోవాలని కాంగ్రెస్ నాయకలు హస్నాపూర్ మాజీ ఉప సర్పంచ్ అశోక్ అన్నారు. బుధవారం మండలలోని హస్నాపూర్‌లో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడంతో పాటు కొత్త రేషన్‌కార్డులు అందిస్తోందన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

బేల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేదవాడికి ఉచిత సన్నబియ్యం అందించాలనే సంకల్పంతో తెలుగు కొత్త సంవత్సరం ఉగాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దహేగావ్ గ్రామంలో ఉచిత సన్న బియ్యం కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ రఘునందన్‌రావు మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మార్కెట్ వైస్ చైర్మెన్ విలాస్ పాటిల్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేదవాడి ఆకలి తీర్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అమలు చేయడం చాలా ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ యూత్ వైస్ ప్రెసిడెంట్ సామ రూపేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాపూరావు హుల్కె, మార్కెట్ డైరెక్టర్ చంద్రకాంత్, కిసాన్ సెల్ అధ్యక్షులు ఘన్‌శ్యామ్, నాయకులు సుధాంరెడ్డి, బండి సుదర్శన్, శంకర్ భోక్రే, సాగర్ థాక్రే పాల్గొన్నారు.

ఖానాపూర్ : నిరుపేదల ఆకలి తీర్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ అబ్దుల్ మజీద్ అన్నారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ షాప్ నెంబర్-2, పద్మావతి నగర్ షాప్ నెంబర్-7, సుభాష్ నగర్‌లోని షాప్ నెంబర్-9, రాజీవ్ నగర్‌లోని షాప్ నెంబర్-28లలో సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని రేషన్ షాపులలో పంపిణీ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం, కాంగ్రెస్ మండలాధ్యక్షులు దోనికేని దయానంద్, పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, తహసీల్దార్ సుజాత, కమిషనర్ జాదవ్ కృష్ణ, ఆర్‌ఐలు నగేష్, సత్యనారాయణ, నాయకులు తోట సత్యం, యూసుఫ్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కడర్ల గంగ నర్సయ్య, శౌకత్ పాషా, శంకర్, గంగాధర్, నేత శ్యామ్, సయ్యద్ ఆయుబ్, మీర్జా బేగ్, కమోజీ శ్రీను, మహేష్, రాజేశ్వర్, శ్రీహరి, అజీజ్, బి.రాజేందర్, రియాజ్, కమల్‌రాజ్, వేణు, జియా, షాకిర్, రాము పాల్గొన్నారు.



ఖానాపూర్ : బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ అబ్దుల్ మజీద్

వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



నవతెలంగాణ-ఉట్నూర్

వేసవి దృష్ట్యా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్‌సీ భవనంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్‌భగీరథ, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు, తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన ప్రణాళిక రూపొందించుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ జైవంత్‌రావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాంజీగోండ్ వర్ధంతి సభ జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, రాంజీ గోండ్ వర్ధంతి నిర్వహణ కమిటీ సహకారంతో మర్సకోల రాంజీ గోండ్ 167వ వర్ధంతి సభ ఏప్రిల్ 9న నిర్మల్ జిల్లా కురన్నపేట్‌లో నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు, రాంజీ గోండ్ వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు తొడసం శంభు కోరారు. ఈ సందర్భంగా స్తూపం వద్ద నుంచి గిరిజన సంప్రదాయ డోల్ ప్రదర్శన, నృత్య ప్రదర్శనలు నిర్వహించబడతాయని, అనంతరం బహిరంగ సభ జరగనుందని, ఈ సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బందారు రవి కుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ సభలో గిరిజనుల చారిత్రక పోరాట గాథలు, మర్సకోల రాంజీ గోండ్ నాయకత్వం, ఆదివాసీ సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తిదాయక ఉపదేశాలు చర్చించబడతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాంజీ గోండ్ వర్ధంతి నిర్వహణ కమిటీ అధ్యక్షులు తొడసం శంభ మాట్లాడుతూ గిరిజన సమాజాన్ని నేడు ఎదుర్కొంటున్న సవాళ్లకు మార్సకోల రాంజీ గోండ్ పోరాట మార్గదర్శనం అందిస్తుందని ఆయన ఆశయాలను గుర్తుచేసుకునేందుకు, గిరిజన ఐక్యతను ప్రదర్శించేందుకు ఈ సభ వేదికగా మారాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సోయం సూర్యబాన్, ఉయిక భీంరావ్, ఆత్రం అర్జున్, వెలది గణేష్, కుడ్మెత విజయ్, దుర్వ నాగోరావు పాల్గొన్నారు.

అతివలకు అండగా షీ టీమ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా షీటీమ్ బృందాలు 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ అతివలకు అండగా నిలుస్తున్నాయని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. బుధవారం మహిళలు, విద్యార్థినులకు, ఉద్యోగస్థలాలలో, కళాశాలలలో ఎలాంటి సమస్యలున్నా, వేధింపులున్నా జిల్లా షీటీం బృందాలను సంప్రదించాలని పేర్కొన్నారు. 24 గంటలు పని చేసేలా మొబైల్ నెంబర్ 8712659953 ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గత నెలలో 34 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, ఫిర్యాదులు అందిన వాటిలో మూడు ఈ పీటీ కేసులు, మావల పోలీస్ స్టేషన్‌లో ఒక ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఐదుగురు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై, మహిళలపై, సైబర్ నేరాలు జరుగు పద్ధతులను, మహిళా చట్టాలపై, నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, చైతన్య పరుస్తున్నారని అన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇచ్చోడ, బోథ్ కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలంటే దూరభారం అవుతోందని, క్వింటాలుకి రూ.100 నుంచి రూ.200 ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. జొన్న కొనుగోలు కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తే దూరభారం తగ్గి రైతులకు తిప్పలు తప్పుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ మేకల వెంకన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జల్కే పాండురంగ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్, నాయకులు చెట్ల వినీల్, విలాస్, డీసీ రమణ, మేకల లింగన్న, శివుడు, శంకర్ ఉన్నారు.

చిట్యాల్‌బోరి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



రూరల్ మండలంలోని చిట్యాల్ బోరి గ్రామ సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహజన్‌ను గ్రామస్తులు కలిసి మాట్లాడారు. ఇటీవల ఎక్సైజ్‌శాఖ చేసినటువంటి కేసులను పరిష్కరించాలని కోరారు. అందుకు ఎస్పీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జగదీష్, మాజీ సర్పంచ్ వసంత్, ఆదివాసీ నాయకులు ఆత్రం వెంకటేష్, ఉప సర్పంచ్ దీపక్, గ్రామస్తులు, పటేల్ కుర్సెంగ మనోహర్, దేవారి గంగారాం మహజన్, ఉయిక రమేష్, మారుతి, సంతోష్, జ్యోతిరాం పాల్గొన్నారు.

మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలి

- 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి
- 14న అంబేద్కర్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు, సంఘాల నాయకులకు సూచించారు. షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన డా.బాబూ జగ్జీవన్‌రాం, డా.బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు సంబంధించి సన్నాహక సమావేశంలో ఎస్పీ అఖిల్ మహజన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5న బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి, ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని సూచించారు. అందుకు సంబంధిత శాఖల అధికారులు మున్సిపల్, పంచాయతి, విద్యుత్, తదితర అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలీస్ శాఖ తరుపున గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని, బెల్ట్ షాపులను మూసివేయించాలని సూచించారు. వివిధ సంఘాల అభిప్రాయాల మేరకు సలహాలు, సూచనల ప్రకారం జయంతి కార్యక్రమాలు, ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేసే విధంగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయడం జరుగుతుందని అందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో జయంతి వేడుకల నిర్వహించనున్న సందర్భంగా వసతులు, భోజన సౌకర్యం, మజ్జిగ, తదితర సదుపాయాలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, డీఎస్సీడీఓ సునీత, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పాపన్న స్ఫూర్తితో రాజ్యాధికారానికి పోరాడుదాం

- తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మెన్ అమరవేణి నర్సాగౌడ్



నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో రాజ్యాధికారానికై పోరాడుదామని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందున్న పాపన్నగౌడ్ విగ్రహం వద్ద బుధవారం మోకుదెబ్బ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ 315వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అనుముల భాస్కర్, మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు పడాల రాజేందర్, కొండ బాలగౌడ్, తీగల వెంకట్ గౌడ్, యాగండ్ల దశగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసి మొగల్ పాలకుల మెడలు వంచి పోరాడినా యోధుడన్నారు. పాపన్న ఆశయాలను సాధించాలంటే బడుగులకు రాజ్యాధికారం రావాలాన్నారు. కార్యక్రమంలో మోకు దెబ్బ జిల్లా నాయకులు శివోల్ల రవీందర్, తీగెల శ్రీనివాస్, కొండ మురళి, పీసర శ్రీనివాస్, గడ్డం మహేందర్, రాజేశ్వర్, భోజరాజ్, కొండ శ్రీనివాస్, దివాకర్, దినేష్, అశ్విన్, రాజేశ్వర్, శ్రీనివాస్, గంగాగౌడ్ పాల్గొన్నారు.



కడెం : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 315వ వర్ధంతిని మండల గౌడ నాయకులు, గౌడ కులస్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పాపన్న గౌడ్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత తొలిబహుజన రాజ్యాధికార పోరాటయోధుడు దొరలు, మొగలాయిల నుంచి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ నాయకులు, కులస్తులు రవీందర్, శేఖర్, రాజేశ్వర్, రాజేష్, అనిల్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

నవతెలంగాణ-నార్నూర్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలని ఏఐసీసీ సభ్యులు డా.నరేష్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని పూసిగూడ గ్రామంలో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కోఆర్డినేటర్, ఏఐసీసీ సభ్యులు డా.నరేష్ జాదవ్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అప్రజాస్వామిక నియంతృత్వ పాలనను కొనసాగిస్తున్నటువంటి కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎండగట్టాలన్నారు. నిండు పార్లమెంటు సభలో కేంద్ర హోం మంత్రి బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడారని పేర్కొన్నారు. దేశపు రాజ్యాంగాన్ని మార్చాలని, పదేపదే ప్రయత్నిస్తున్నటువంటి కేంద్ర ప్రభుత్వ విధానాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. బాపూజీ అహింసా, సత్య మార్గాన్ని ప్రబోధించారని వారి సిద్ధాంతాన్నీ తెలియజేయాలన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన స్వేచ్ఛ సామాజిక సమానత్వాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండలాధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్, శేషరావ్, బ్రిజులాల్, యూత్ కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్, షేక్ నషీర్, బానోత్ విలాస్, ఏఎంసీ డైరెక్టర్ కైలాష్, కాంతారావు పాల్గొన్నారు.



రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయోమయంలో రైతాంగం



నవతెలంగాణ-కడెం

సదర్మాట్ చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందక ఎండిపోతున్న పంటలను చూసి అయోమయ పరిస్థితిలో రైతులు ఉన్నారని రైతు నాయకులు హపావత్ రాజేందర్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు రైతు నాయకులు రాజేందర్ మొర్రి గూడెం, చిన్న బెల్లాల్, పెద్ద బెల్లాల్ గ్రామానికి చెందిన రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని మొర్రి గూడెం, చిన్న బెల్లాల్, పెద్ద బెల్లాల్, పెద్దూర్ తండా, చిట్యాల, కొత్త మద్దిపడగ, లక్ష్మీ సాగర్ రైతులకు మరో రెండు తడులకు సాగు నీరు అందించాలని కోరారు. పొలాలు పొట్టకు వచ్చిన దశలో సాగు నీరు అందక ఎండిపోతున్నాయని వివరించారు. చెరువులు, కుంటలు నింపి సాగు నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేష్, మల్లేష్, రాజేశ్వర్, శ్రీనివాస్, సత్తన్న, గంగన్న, దుర్గం హనుమండ్లు, చిన్నరాజం, నర్సయ్య, లింగన్న, లచ్చన్న రవి, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, ఉపేందర్ ఉన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి, బాపూజీ చిత్రపటానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ మేరకు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కరపత్రాలను పంపిణీ చేశారు. రాజ్యాంగ పీఠిక ప్రదర్శన చేపట్టారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కుంట వేణుగోపాల్, ఓడ్నాల రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీమ్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ నాయకులు బొజ్జారం పటేల్, మాజీ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రు రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాండ్ల విలాస్, బందిశీల సాగర్ పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మార్చి 21 నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలో మొత్తం 36 సెంటర్లు ఏర్పాటు చేయగా 6547 మంది పరీక్ష రాయనుండగా చివరి రోజు 6522 మంది పరీక్షకు హాజరుకాగా 25 మంది గైర్హాజరయ్యారు. మొత్తం హాజరు శాతం 99.6శాతంగా ఉందని జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు తెలిపారు. జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు కాకుండా డిబార్ కేసులు నమోదు కాకుండా పరీక్షలు పూర్తైనట్లు తెలిపారు. అయితే పరీక్షలకు సంబంధించిన ఫలితాలు మే మొదటి వారంలో విడుదల కానున్నట్లు ఉన్నతాధికారులు వివరించారు.

టీకాలపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి



వ్యాధి నిరోదక టీకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని కన్నర్‌గాం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, 0-5 పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు ప్రతినెల క్రమం తప్పకుండా టీకాలు తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రతినెల పరీక్షలు చేయించుకోవాలని, ఎండాకాలంలో వడ్డదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నమాల, ఏఎన్ఎం సుమిత, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

జయంతులపై నాయకులతో కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏప్రిల్ నెలలో రానున్న బాబు జగ్జీవన్ రావు, జ్యోతిబాపూలే, అంబేద్కర్ జయంతులకు సంబంధించి ఆయా సంఘాల నాయకులతో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న బాబు జగ్జీవన్ రామ్, 14న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఇందులో భాగంగా మహనీయుల జయంతి రోజున విగ్రహాల అలంకరణ, వేదికల ఏర్పాట్లు చేయాలని, గ్రామాలు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారని, అధికారి సమన్వయంతో వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణకు చర్యలు చేపట్టాలని, జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనానికి అవసరమైన స్థలం ఎంపిక చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, నాయకులు సుభాష్, తుకారాం, అశోక్, చరణ్ దాస్, కేశవరావు, డోంగ్రె సునీల్, కుడుక శ్రీనివాస్, జోడే శివరాం, దుర్గం సూరజ్, చునార్కర్ లింగయ్య యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి సిద్ధం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా షీ టీం, భరోసా సెంటర్ ద్వారా 74 హాట్ స్పాట్‌లలో 13 అవగాహన కార్యక్రమాలు, 3 కేసులలో కౌన్సెలింగ్, 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై షీ టీం, భరోసా టీం, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎవరైనా మహిళలు, పిల్లలు వేధింపులకు గురైనట్టు గమనిస్తే, పోలీసులను నేరుగా సంప్రదించలేని వారు షీ టీంని సంప్రదించాలని, జిల్లా వ్యాప్తంగా రెండు షీ టీంలు పనిచేస్తున్నాయని, ఆసిఫాబాద్ డివిజన్ షీటీం నెంబర్ 8712670564, కాగజ్‌నగర్ డివిజన్ షీటీం నెంబర్ 8712670565 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

సంవిధాన్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జైనూర్

సంవిధాన్ బచావ్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీని ప్రారంభించారు. సంవిధాన్ బచావో కార్యక్రమంలో భాగంగా జైనూర్, సిర్పూర్-యు, లింగాపూర్ మండలల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో జై భీమ్ జై సవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న పార్టీ నాయకులు తప్పకుండా హాజరై ప్రజలకు సవిధాన్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. భారత రాజ్యాంగం రాసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని కోరారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ ఫోటో తీసుకొని బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు హైమత్ ఖాన్ వసీం, మెస్రం అంబాజీ పాల్గొన్నారు.

ఝాన్సీ ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని లోనవెల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల(బాలికలు) విద్యార్థిని జాడి ఝాన్సీ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల 2025-26లో 5వ తరగతి ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించింది. దీంతో బుధవారం విద్యార్థులు ఆమెకు అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అవధూత చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థిని ఈ ఘనత సాధించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం ఉందన్నారు. కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి, సీఎంఓ కటుకం మధూకర్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామం నుంచి ఇప్పటికే పలువురు ఉన్నత స్థాయికి చేరుకున్నారని, మీరు కూడా వారి మార్గంలో నడిచి మీ భవిష్యత్తును మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. ఇందులోఉపాధ్యాయులు ముజాకీర్ అహ్మద్, కె.జమున, దుబ్బగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత ఉన్నారు.

కోదండ రామాలయ కళ్యాణానికి ఆహ్వానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రామాలయంలో ఈనెల 6న నిర్వహించే కోదండ రామాలయం కల్యాణ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవానికి సంబంధించిన పలు అంశాలను కలెక్టర్‌తో చర్చించినట్లు ఆయన పలు సూచన సలహాలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొమ్మన బాలేష్ గౌడ్, శైలేందర్, గిరి, నాగరాజు పాల్గొన్నారు.



ఆదర్శం ఆసిఫాబాద్ జిల్లా

- పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో ఆరో ర్యాంక్
- నిర్దేశించిన లక్ష్యంలో 94 శాతం పూర్తి
- శతశాతం దిశగా ప్రయత్నాలు



ఇంటిపన్ను వసూలు చేస్తున్న అధికారులు (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పక్క ప్రణాళిక, సమావేశాలు, సిబ్బందికి సరైన సమయంలో దిశానిర్దేశం చేస్తు పన్నుల వసూళ్లలో ఆదివాసీ జిల్లా అయిన కుమురంభీం-ఆసిఫాబాద్ రాష్ట్రంలో ఆరో ర్యాంక్ సాధించింది. ఇంటి పన్నుల చెల్లింపులు మాత్రం అభివృద్ధి చెందిన జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలిచింది. గ్రామపంచాయతీలకు ముఖ్యమైన ఆదాయమైన ఇంటి పన్నుల వసూలలో జిల్లా అధికారులు ముందు నుంచి పకడ్బందీ ప్రణాళికతో అనుకున్న లక్ష్యాన్ని సాధించినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఆసిఫాబాద్‌కు కొంత ప్రత్యేకత ఉంటుంది. మిగతా జిల్లాలతో పోలిస్తే ప్రజలు సౌమ్యంగా ఉండడంతో పాటు కొంత అభివృద్ధికి దూరంగా ఉంటారని చెప్పకనే చెప్పవచ్చు.

జిల్లాలో ఇది పరిస్థితి

జిల్లాలో 15 మండలాల్లో మొత్తం 335 గ్రామపంచాయతీలున్నాయి. వీటిలో 1,36,360 ఇండ్లు గుర్తించగా వీటి నుండి పన్నుల రూపంలో రూ.ఐదు కోట్ల 49 లక్షలు పైచిలుకు వసూలు చేయాలి. ఇందులో రూ.5,16,03,476 వసూలు చేశారు. దీంతో రాష్ట్రంలో వసూళ్లలో ఆరవ ర్యాంకు సాధించడంతో పాటు 15వ స్థానంలో నిలిచింది.

లక్ష్యంలో 94 శాతం పూర్తి

అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యం రూ.ఐదు కోట్ల 49 లక్షలు కాగా రూ.5 కోట్ల 16 లక్షలు వసూళు చేసి 94 శాతం పూర్తి చేసింది. అయితే జిల్లాలోని 15 మండలాల్లో పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్, సిర్పూర్ (టి), కౌటాల, దహెగాం మండలాల్లో 100శాతం పన్ను వసూలు చేసిన అధికారులు, చింతలమానపల్లి మండలంలో 99 శాతం, సిర్పూర్(యు), రెబ్బెన, కాగజ్‌నగర్, కెరమెరి, లింగాపూర్, వాంకిడి మండలాల్లో 90 శాతంకు పైగా కాగా తిర్యాణి, బెజ్జూర్ మండలాల్లో 80శాతం పైగా సాధించిన అధికారులు జైనుర్‌లో మాత్రం 70 శాతం దగ్గర ఆగిపోయారు.

శత శాతం దిశగా ప్రయత్నాలు

జిల్లా అత్యధిక పన్ను వసూళ్లలో అభివృద్ధి చెందిన జిల్లాలకు ఆదర్శంగా నిలవడంతో పాటు ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎంతగానో కృషి చేశారు. అయితే 100శాతం పన్నుల వసూలు లక్ష్యంగా నిర్దేశించుకున్న అది చేరుకోలేదు. కానీ ఒకటి రెండు రోజుల్లో ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

పన్నుల వసూల్లో సిబ్బంది కృషి

భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి



జిల్లాలో ఐదు మండలాలు 100శాతం వసూలు కావడం మిగతా మండలాల్లో 90 శాతం పైగా వసూలు చేయడం వెనక సిబ్బంది కృషి ఉంది. కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాలోని అన్ని మండలాల్లో 100శాతం సాధించే దిశగా ప్రయత్నాలు చేశాం. లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించలేనప్పటికీ ప్రస్తుతం సాధించిన లక్ష్యం సంతోషాన్ని ఇచ్చింది.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కెరమెరి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని సీఐటీయూ మండల కన్వీనర్ కుటికెల ఆనంద్ రావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి సమ్మెకు సంబంధించిన నోటీసు అందజేసి ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు ఎన్నో ఏండ్లుగా సేవలందిస్తున్న కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. ప్రతి నెల వేతనాలు రాక ఇబ్బందులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనవరి నుండి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తానన్న ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన నెరవేరలేదని ఆరోపించారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, ఉద్యోగ భద్రత కల్పిస్తానని 34 రోజుల సమ్మెసందర్భంగా హామీ ఇచ్చి గత ప్రభుత్వ విధానాలని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు నెలలుగా వేతనాలు చెల్లిస్తూ చెక్కులు చేసినప్పటికి ఎస్టీఓల్లో నిధులు లేక నిలిచిపోయాయన్నారు. ఆరు నెలలుగా ఆగిపోయిన వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబర్ 51సవరించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో 19 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంతోష్, అనిల్, నగేష్, వెంకటి, మల్లేష్, శ్రీనివాస్, బుజంగ్ పాల్గొన్నారు.

జిల్లా సివిల్ సప్లయ్ అధికారికి షోకాజ్ నోటీస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వ నూతనంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో అలసత్వం వహించినందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బాబావినోద్ కుమార్‌కు షోకాజ్ నోటీస్ జారీచేస్తూ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఉత్తర్వులు జారీ చేశారు. మంగళ, బుధవారాల్లో అధికారికంగా నిర్వహించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొనక పోవడానికి గాను నోటీసులు జారీ చేసినట్లు, రెండు రోజుల్లో సమాధానం ఇవ్వకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్సీ



చింతమానేపల్లి : సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

పేదలకు సరైన సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్సే అని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రేషన్ షాప్‌లో సన్న బియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవారికి సన్నబియ్యంతో భోజనం పెట్టాలన్న ఆలోచనతో ఆరు గ్యారంటిల్లో ఈ పథకాన్ని ప్రారంభించామని, ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకమన్నారు. ఏ ప్రభుత్వాలున్నా ఈ సన్న బియ్యం పథకాన్ని రద్దు చేయలేరని పేర్కొన్నారు. పేదవారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోవాలన్న సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించామని వివరించారు. సన్నబియ్యం పథకం ద్వారా ప్రతి పేదవారి ఇంట ప్రతిరోజూ పండుగ జరగాలన్న ఆలోచన, పేద వారి కడుపు నింపాలన్న లక్ష్యంతో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, తహసీల్దార్ మునవర్ షరీఫ్, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, నాయకులు మారోతి, ఉమా మహేష్, బింకరీ నారాయణ, ప్రసాద్, ఎస్సై ఇస్లావత్ నరేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : మండలంలోని రేషన్ షాప్ నెంబర్-3లో సన్న బియ్యం పథకాన్ని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవారికి సంక్షేమ పథకాలను అందించలన్న లక్ష్యం, పౌష్టికాహారం కోసం సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కెరమెరి : సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ సజావుగా చేపట్టాలని అదనప కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండలంలోని ఝరి రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రేషన్ దుకాణానికి కేటాయించన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలపై ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ వివరాలను పరిశీలించారు. బయోమెట్రిక్ ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని గమనించి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదన్నారు. అనంతరం స్థానిక రైతు పొలంలోని నర్సరిలో మొక్కలను పరిశీలించారు. నర్సరీలో 80శాతం మొక్కలే ఉన్నాయని 100శాతం పూర్తి చేయాలన్నారు. దానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న నారు వేసుకోవాలన్నారు. మరోసారి సందర్శించిన సమయంలో నర్సరీలో 100శాతం మొక్కలుండాలన్నారు. అక్కడి నుంచి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపడుతున్న మోడల్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ అంజత్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి మునిర్ అహ్మద్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కోవా ఇందిరా, పంచాయతీ కార్యదర్శి గణేష్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, డీలర్ అయూబ్ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సన్నబియ్యం పథకాన్ని మండలాధికారులు ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న సన్నబియ్యం అందరికి అందేలా చూడాలని, నిరుపేదలకు అందించాలన్నారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి ఆటంకం కలుగకుండా నిరుపేదలకు పంపిణీ చేయాలని సూచించారు. మండలంలోని డీలర్లు కూడా కార్డుదారులకు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఆర్ఐలు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. బుధవారం మండలంలోని లోడ్‌పెల్లి గ్రామంలో సబ్ కలెక్టర్ లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ కొమురయ్య, రేషన్ డీలర్ బాపురావు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.



సిర్పూర్(టి) : సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ, సబ్ కలెక్టర్



కెరమెరి : సన్నబియ్యం పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్



పెంచికల్‌పేట్ : సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కలక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సజీవన్ అధ్యక్షతన ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలకు అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్ బహదూర్‌లు చేస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటను గడగడలాడించిన వీరుడు, తొలిదశ విప్లవకారుడు సర్దార్ పాపన్న అని అన్నారు. పోరాడితే సాదించనిధి ఏమి ఉండదని, గోల్కొండ రాజ్యానికి రాజై నిరూపించాడన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో బీసీలు ముందుకు సాగాలన్నారు. అంతకుముందు గౌడ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో తమ సంఘ భవన నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు సుదర్శన్, రామగౌడ్, ప్రసాద్, బాపగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా ప్రదర్శన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సవాతి గ్రామ పంచాయతీలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్ఓ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆటపాటలతో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఎండాకాలంలో వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితి ఉంటేనే బయటకు వెళ్లాలని, ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో టీం లీడర్ సురేందర్, గొడిసెల బాపు, మోహన్ నాయక్, శ్రావణ్‌కుమార్, పురుషోత్తం, శిరీషా, గ్రామస్తులు పాల్గొన్నారు.



4
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | ఏప్రిల్ 03, 2025 | www.navatelangana.com

మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్

నవతెలంగాణ-లక్సెట్టిపేట



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉన్నతాధికారులకు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు విందు ఏర్పాటు చేసి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షుడు షాహిద్ అలీ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు మున్సిపాలిటీ తరపున పారిశుధ్యంలో గాని, నీటి సరఫరాలో గాని, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖల అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సహకరించిన ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎలక్ట్రిసిటీ ఏఈ గణేష్, నవాబ్ ఖాన్, అబ్బు బాయ్, ఇసాక్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన రవితేజ(23) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. హైదరాబాదులో బీటెక్ చదువుతున్న రవితేజ ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. తన కంటిచూపునయమవుతుందో లేదో ననే ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉరి వేసుకొని చనిపోతున్నట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచా ఇచ్చాడు. కుటుంబ సభ్యులు వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో వెంటనే రవితేజను బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యువకుడి మేనమామ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపయోగం లేని బెల్లంపల్లి మామిడి మార్కెట్

- కోల్డ్ స్టోరేజ్, గోదాములు లేక ముందుకు రాని ట్రేడర్లు
- సౌకర్యాలు కల్పిస్తే మార్కెట్ శాఖకు భారీ ఆదాయం

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలో మామిడి మార్కెట్ ఉన్నా క్రయవిక్రయాలకు నోచుకోకపోవడం లేదు. రూ.126 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మార్కెట్‌లో పచ్చికాయల గ్రేడింగ్, ట్రేడింగ్‌కు మాత్రమే వసతులు కల్పించారు. కోల్డ్ స్టోరేజీ మామిడి పండ్ల నిల్వ గోదాములు లేకపోవడంతో ట్రేడర్లు ఇక్కడ వ్యాపారం నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో మామిడి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. స్థానికంగా మార్కెట్ వసతి లేకపోవడంతో మామిడి రైతులు అన్నంత రేటుకు గుత్త దారుకు తోటలు అప్పగించి నష్టపోవాల్సి వస్తుంది. మామిడికాయలను సొంతగా మార్కెటింగ్ చేసే రైతులు నాగ్‌పూర్, చంద్రాపూర్ ప్రాంతాలకు వెళ్లి రవాణా చార్జీలు కమిషన్, చార్జీలు చెల్లించి నష్టపోతున్నారు. స్థానికంగా కోల్డ్ స్టోరేజీలు మామిడి నిలువ ఆధారిత పరిశ్రమలు లేకపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతోంది. అకాల వర్షాలకు ఈదురుగాడుపులకు నేల పాలవుతోంది. ఉద్యానవన శాఖ లెక్కల ప్రకారం మంచిర్యాల జిల్లాలో 15,538 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇందులో మూడు నుంచి ఐదు ఎకరాల మామిడి తోటలు గల రైతులు ఎక్కువగా ఉన్నారు. మామిడి మార్కెట్ సుదూర ప్రాంతాల్లో ఉండడం వల్ల చిన్నపాటి తోటలు ఉన్న రైతులు మామిడిని సొంతగా మార్కెట్ చేయలేక నష్టపోతున్నారు.

మహారాష్ట్ర నాగ్‌పూర్ మార్కెట్‌కు తరళింపు

స్థానికంగా మార్కెట్‌లో సౌకర్యం లేకపోవడంతోళ రైతులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. అక్కడి వ్యాపారులు, దళారులకు, సిండికేట్గా మారి మామిడి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. మామిడి వ్యాపారం ఎక్కువ రోజులు నిలువ ఉండని కచ్చా దందా కావడం వల్ల అక్కడి వ్యాపారులు నిర్ణయించిన ధరకు పంటను అమ్మాల్సి వస్తోంది. సరిహద్దు రాష్ట్రాలకు మామిడి పంటను తరలించడం వల్ల రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆదాయాన్ని కోల్పోతుంది.

పదేండ్లయినా ప్రారంభం కానీ మామిడి మార్కెట్

బెల్లంపల్లి కేంద్రంగా 2015లో మ్యాంగో మార్కెట్ మంజూరైంది. రూ.126 కోట్ల అంచనాతో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం పక్కన రెండు మ్యాంగో కవర్ షెడ్లను, ప్రహరీని నిర్మించారు. పదేళ్లుగా బెల్లంపల్లి మామిడి మార్కెట్లో క్రయవిక్రయాలు జరగక అలంకారప్రాయంగా మారింది. 2003లో అదనపు సౌకర్యాల కోసం రూ.1.18 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.8లక్షల అంచనాతో ఆర్వో ప్లాంటు, రూ.36 లక్షలతో మార్కెట్ ఆవరణలో సీసీ రోడ్లు వేశారు. రూ.74 లక్షలతో అదనంగా మరో కవర్ షెడ్ నిర్మించాల్సి ఉన్నా టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.



బెల్లంపల్లి మార్కెట్ యార్డు పక్కనే ఏర్పాటు చేసిన మామిడి మార్కెట్

శీతల గిడ్డంగులు లేకపోవడమే కారణం

ప్రతి మామిడి సీజన్‌కు ముందు బెల్లంపల్లి మామిడిలో వ్యాపారం నిర్వహించేందుకు లైసెన్స్‌లో జారీ ప్రక్రియ నిర్వహిస్తున్నప్పటికీ ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లు ఎవరు ముందుకు రావడం లేదు. బెల్లంపల్లి మార్కెట్‌లో శీతల గిడ్డంగులు నిలువ గోదాములు లేకపోవడం వల్ల ట్రేడర్లు లైసెన్సులు తీసుకోవడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. పూలు, కూరగాయలు, మామిడి వ్యాపారం డిమాండ్ సప్లైయ్ వినియోగం సరుకు నిల్వ, రవాణాపై ఆధారపడి ఉంటుంది. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో సరుకు రవాణా, వినియోగం లేకపోవడంతో మామిడి ట్రేడర్లు ఘోరంగా నష్టపోయారు. శీతల గిడ్డంగులు సరుకు నిల్వ గోదాములు నిర్మించి, వసతులు కల్పిస్తే ట్రేడర్లు వ్యాపారం నిర్వహించేందుకు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

నిరుపయోగంగా మార్కెట్ యార్డ్ గోదాములు

బెల్లంపల్లి మామిడి మార్కెట్ పక్కనే బెల్లంపల్లి మార్కెట్ యార్డ్ గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. ఉమ్మడి ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీలో విలీనమై ఉన్న బెల్లంపల్లి 2012లో ప్రత్యేక మార్కెట్ కమిటీగా ఏర్పడింది. మార్కెట్ కమిటీ పరిధిలో 11.200 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములను నిర్మించారు. రైతుల పంట ఉత్పత్తుల నిల్వల కోసం ఏర్పాటుచేసిన ఈ గోదాములు నిర్మించిన నాటి నుండి వినియోగించలేదు. మార్కెటింగ్ శాఖ ఆధీనంలో ఉన్న గోదాములను మామిడి శీతల గిడ్డంగులకు వినియోగించి వసతులు కల్పించినట్లయితే మార్కెటింగ్ శాఖకు కమిషన్ల రూపంలో మంచి ఆదాయం చేకూరే అవకాశాలు ఉన్నాయి.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ..

మామిడి మార్కెట్‌ను వినియోగంలో తీసుకువచ్చేందుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. బీఆర్ఎస్ హయంలో నిర్మాణమై నిరుపయోగంగా ఉన్న మామిడి మార్కెట్‌ను ప్రారంభించి ప్రజల మద్దతు కూడా కట్టుకునేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. మార్కెట్లో శీతల గిడ్డంగుల విషయమై నాబార్డు అధికారులతో ఎమ్మెల్యే చర్చలు జరిపినట్లు తెలిపారు. నాబార్డ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిధులు సమకూర్చినట్లయితే బెల్లంపల్లిలో మామిడి మార్కెట్ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.



పదేండ్లుగా ప్రారంభానికి నోచుకోని బెల్లంపల్లి మామిడి మార్కెట్

ఉద్యోగోన్నతితో భాధ్యత పెరుగుతుంది

- సీపీ అంబర్ కిషోర్ ఝూ



నవతెలంగాణ-జైపూర్

పోలీసు ఉద్యోగులకు ఉద్యోగోన్నతితో గుర్తింపుతో పాటు బాధ్యతలు పెరుగుతాయని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. 51 మంది కానిస్టేబుల్‌లకు హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందిన వారికి గుర్తింపు చిహ్నం అలంకరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పదోన్నతులు పొందిన వారు ఎలాంటి రిమార్కు లేకుండా విధులు నిర్వర్తించి, విధుల పట్ల మంచి పనితీరు కనబర్చి భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పని చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పని చేస్తే ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని ఇప్పటి వరకు ఎలాంటి క్రమశిక్షణతో విధులు నిర్వర్తించారో అదేవిధంగా మిగితా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యలతో ఆనందంగా ఉంటారని, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరు శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని సీపీ తెలిపారు.

పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలపై ఆస్పత్రులకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, వేసవికాలం అయినందున వడదెబ్బ నుంచి కాపాడుకునేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వల తనిఖీ



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని రేషన్ షాపులలో దొడ్డు బియ్యం నిల్వలను బుధవారం జిల్లా సివిల్ సప్లయి ఇన్స్‌పెక్టర్ జే.మురళీకృష్ణ తనిఖీలు నిర్వహించారు. రేషన్ షాపుల్లోని దొడ్డు బియ్యం నిల్వలను రికార్డు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో లబ్దిదారులకు సన్న బియ్యమే పంపిణీ చేయాలని, దొడ్డు బియ్యం పంపిణీ చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలన్నారు. డీలర్లు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే సమాచారం అందించాలని కోరారు.

రాజ్యాంగాని కాపాడుకుందాం

నవతెలంగాణ-మంచిర్యాల



భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్నారని మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని బీజేపీ తుంగలో తొక్కే ప్రయత్నాలు చేస్తోందని, ప్రజల్లో రాజ్యాంగం పట్ల అవగాహనా కల్పిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే ఉదేశ్యంతో కాంగ్రెస్ ఈ పాదయాత్ర చేపట్టిందన్నారు. దేశానికి స్వతంత్రం రావడంలో కాంగ్రెస్ ముఖ్యపాత్ర పోషించిందన్నారు. డా బాబా సాహెబ్ అంబెద్కర్ రచించిన రాజ్యాంగం రూపురేఖలు మార్చాలని బీజేపీ ప్రభుత్వం చూస్తుందన్నారు. రాజ్యాంగ రక్షణకై కాంగ్రెస్ చేపట్టిన పాదయాత్రలో పెద్ద ఎత్తున యువకులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, నాయకులు గడ్డం త్రిమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో సన్న బియ్యం పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒకరికి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని చెన్నారం మండలం మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుర్గం, లక్ష్మీనారాయణ మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య అన్నారు. బుధవారం సన్న బియ్యం కార్యక్రమాన్ని మండలంలోని కిష్టాపూర్ రేషన్ దుకాణంలో వారు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. పేద ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిష్టాపూర్ మాజీ సర్పంచ్ కోలా పద్మారావ్, కాంగ్రెస్ నాయకులు బండారి స్వామి, రేణిగుంట బాపూరావు, మూగల అజయ్, కొప్పుల రాము, డీలర్ గుండా రమేష్ పాల్గొన్నారు.

4న ధర్నాను విజయవంతం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కనికరపు అశోక్

నవతెలంగాణ-దండేపల్లి

ఈ నెల 4న దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సమస్యల పరిష్కారానికి చేపటనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కనికారపు ఆశోక్ పిలుపునిచ్చారు. బుధవారం మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గత వారం రోజులుగా గిరిజన తండాలు ఇతర గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సర్వే నిర్వహించామని తెలిపారు. ప్రధానంగా గిరిజన గ్రామాలకు విద్యుత్ దీపాలు, రోడ్డు సౌకర్యం, డ్రైనేజీ, పెన్షన్లు, ఉపాధి హామీ, రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇల్లు, పోడు భూములకు హక్కు పత్రాలు వంటి సమస్యలపై ఈ నెల నాలుగున దండేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజలు గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, నాయకులు దోసండ్ల ఎల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కనికరపు ఆశోక్

జిల్లాలో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నాం

నవతెలంగాణ-జైపూర్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేదాజ్ఞలు అమలు పరుస్తున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రామగుండం కమీషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో మద్యం బహిరంగ ప్రదేశాల్లో సేవించడంపై అమలులో ఉన్నటువంటి నిషేదాజ్ఞలు పొడిగిస్తున్నామని తెలిపారు. మద్యం ప్రియుల ఆగడాలపై అందుతున్న పిర్యాదుల నేపథ్యంలో నిషేదాజ్ఞలు కొనసాగిస్తున్నామని, మద్యం ప్రియుల ఆగడాలను అరికట్టడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 2025 ఎప్రిల్ 01 నుండి 2025 మే 01 వరకు నిషేదాజ్ఞలు కొనసాగుతాయని పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. బీఎన్ఎస్ 223 హైదరాబాద్ నగర పోలీస్ చట్టం 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీజే, డ్రోన్‌లపై కూడా నిషేదాజ్ఞలు కొనసాగింపు

డీజే సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలు పొడగించామని తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. చిన్న పిల్లలు, వృద్దులు, రోగులు, విద్యార్థులు విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్స్‌లతో కూడిన డీజే సౌండ్ వినియోగంపై నిషేదాజ్ఞలు విధించామని తెలిపారు. వివిధ కార్యక్రమాల సంధర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్స్ వినియోగిస్తున్నారని అయితే వివిధ కార్యక్రమాల నిర్వాహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీల అనుమతి పొందాలని సూచించారు.

సేవాలాల్ సేన నాయకుల ముందస్తు అరెస్ట్



అరెస్టు అయిన సేవాలాల్ సేన నాయకులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సేవాలాల్ సేన నాయకులను దేవాపూర్ పోలీసులను ముందస్తు ఆరెస్ట్ చేసి దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రంలో అత్యధికంగా జనాభా ఉన్న బంజారాలకు రాష్ట్ర క్యాబినెట్ మంత్రి వర్గంలో అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడికి వెల్తున్న సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లంబాడితండా(డీ) తాజా మాజీ సర్పంచ్ అజ్మీర తిరుపతి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్ గజానంద్ నాయక్, మంచిర్యాల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు లంబాడీతండా(డీ) తాజా మాజీ ఉప సర్పంచ్ అజ్మీర రాజేష్ నాయక్‌లను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సంధర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్ మాట్లాడుతూ ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టకు భయ పడేది లేదని, మా బంజారా జాతి గిరిజన బిడ్డకు మంత్రి పదవి వచ్చే వరకు ఇలానే ఉద్యమాలు చేస్తూనే ఉంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మా బంజారా బిడ్డకు మంత్రి పదవి ఇవ్వడం జరిగిందని, కాని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వకపోవడం చాలా దురదృష్టకరమన్నారు.

బాధితులకు రక్తదానం అభినందనీయం

నవతెలంగాణ-జైపూర్



అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు రక్తదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో బుధవారం బీజేవైఎం, ఎమ్మార్పీఎస్, ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్‌తో కలిసి వారికి పండ్లు పంపిణీ చేశారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు కాసర్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది రక్తదానం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూట రాజకుమార్, కోటపల్లి మండల ఇన్‌చార్జి కాసెట్టి నాగేశ్వర్‌రావు, రామటెంకి సాయి, సుమన్, రామగిరి రాము, వంశీగౌడ్, స్థానిక యువకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని రంగంపేట గ్రామంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిప్పకుర్తి నారాయణ తండ్రి చనిపోగా బుధవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుష్పలత, సింగిల్ విండో చైర్మన్ ఓం ప్రకాష్, పీసీసీ సభ్యులు హర్షద్ హుస్సేన్, గౌడ సంఘం నాయకులు కొండ్ర జగ్గాగౌడ్, సుధాకర్, నాగభూషణం, సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీవర్ధన్, నాహీర్ అలీ, పెంటయ్య పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-జన్నారం





అడవి పంది దాడిలో మండలంలోని పోనకల్ గ్రామానికి చెందిన చిరివేణి కిషన్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడి వివరాల ప్రకారం పొనకల్ గ్రామ శివారులోని నా పంట పొలంకు బుధవారం ఉదయం నీరు పెట్టేందుకు వెళ్లగా ఒక్కసారిగా నాపై అడవి పంది దాడి చేసింది. నేను కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మరో వ్యక్తి అక్కడికి రావడంతో పంది పారిపోయింది. ఈ దాడిలో కిషన్ కుడి భుజం, కుడి కన్ను క్రింద గాయాలు కాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కిషన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

యూనివర్శిటీ భూములను కాపాడుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ భూములను కాపాడుకోవాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎందరో మేధావులను తయారు చేసిన ఈ యూనివర్శిటీ ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిందనీ, ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాలని సూచించారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

హైద్రాబాద్‌లో జర్మనీకి చెందిన యువతి అత్యాచారానికి గురి కావడం బాధాకరమని, దీనికి కారకుడిని కఠినంగా శిక్షించాలని సీనియర్ సిటిజన్ అసోషియేషన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ ఘటనతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టకు భంగం వాటిల్లిందని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాదకద్రవ్యాల మత్తు జీవితాలను నాశనం చేస్తాయని అటువంటి వాటికి యువత దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో కరీంనగర్ ఎస్సై రమేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య, మాతృశ్రీ, గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, బ్రౌన్ షుగర్, కొకైన్, చెరేస్ తదితర మాదకద్రవ్యాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జూన్ 26న ఇంటర్‌నేషనల్ యాంటీ డ్రగ్ డే సందర్భంగా నార్కోటిక్ కంట్రోల్ సెల్ కరీంనగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఇందులో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



నవతెలంగాణ-జన్నారం

జాతీయ ప్రాంతీయ బీసీ సంఘాలు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహిస్తున్న బీసీ పోరు గర్జన సభకు వెళ్లలేకపోయిన మండల బీసీ కులాల నాయకులు స్థానిక తహసీల్దార్ రాజవర్ధన్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కో-కన్వీనర్ కదార్ల నరసయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నాయకులు, ఇతర బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, ఇతర పార్టీల నాయకులు అందరు మద్దతు ఇవ్వడంతో బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిందన్నారు. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింప చేయడం, లేని పక్షంలో షెడ్యూల్ 9లో చేర్చి రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఢిల్లీలో పోరు గర్జన నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కో కన్వీనర్ మూల భాస్కర్‌గౌడ్, జిల్లా కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడఅశోక్ మాజీ ఎంపీటీసీ రాగులశంకర్, బీసీ నాయకులు ముదురుకోల రవి, దాసరి శ్రీనివాస్, కుంట మహేష్, ఆంద్ర పురుషోత్తం, వేణు, గోలిశంకర్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు



నవతెలంగాణ-దండేపల్లి

విద్యార్థులు ఏకాగ్రతను చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని డాక్టర్ కవిత అజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ తరగతి నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఏకాగ్రత మానసికంగా, శరీరకంగా దృఢంగా ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆత్మహత్యలకు పాల్పడవద్దని ధైర్యం ఎదుర్కొవాలన్నారు. ఏకాగ్రతతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాత రమేష్, సంఘర్ష్ రాజేశ్వరరావు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంపై విస్తృత ప్రచారం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రజలందరికీ తెలిసే విధంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఈ నెల 14వ తేదీలోగా రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, ప్రజా పాలన సేవా కేంద్రాలు దరఖాస్తులు అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రతి మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. దరఖాస్తు నింపడంలో అభ్యర్థులకు సహాయకంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి నుండి ప్రతులు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఒకే రకమైన యూనిట్ కాకుండా గ్రామాలలో ఉండే అవసరాలను బట్టి యూనిట్లను ఎంపిక ఎంపిక చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దారులను ఆదేశించారు. రేషన్ కార్డులున్నవారికి ఆదాయ ధ్రువపత్రం అవసరం లేదని తెలిపారు. ఈ పథకంపై గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మండల ప్రజా పాలన సేవా కేంద్రం వద్ద పథకంలో పొందుపరిచిన యూనిట్ల వివరాలు తెలిసే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలనిఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ దత్తారావు, డిటిడబ్ల్యూఓ రమాదేవి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, మండలాల ప్రత్యేక అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ బంద్ విజయవంతం

- బంద్‌కు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే



తైబజార్ రుసుం వసూలు చేయవద్దని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తై బజార్ రుసుం వసూలు చేయడాన్ని నిరసిస్తూ కాగజ్‌నగర్‌లోని కూరగాయల వ్యాపారులు, రైతులు బుధవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఉదయం నుండే కూరగాయల రైతులు, వ్యాపారులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురాకుండా ఆందోళన చేపట్టారు. దీనికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సంఘీభావం తెలిపారు. స్థానిక ఇందిరా మార్కెట్ నుండి రైతులు ర్యాలీగా రాజీవ్ చౌక్ చేరుకున్నారు. కొద్ది సేపు అక్కడ నిరసన తెలిపిన అనంతరం అక్కడి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తై బజార్ రుసుం వసూలు చేయలేదని, దీనితో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇపుడు మళ్లీ ఈ రుసుం వసూలు చేయాలని నిర్ణయించడం బాధాకరమని అన్నారు. గతంలో మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ దృష్టికి ఈ సమస్యను తీసుకుపోయి తై బజార్ రుసుం వసూలు చేయకుండా అడ్డుకున్నామని అన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి ఈ తైబజార్ రుసుం వసూలు చేయడాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో ఈ నియోజకవర్గానికి బాధ్యులుగా ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు తాను, ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు ఈ డబ్బులు చెల్లించాలని సూచించారు. అంతేకాని రైతుల నుండి డబ్బులు వసూలు చేయడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లెండుగురె శ్యాంరావుతో పాటు కూరగాయాల వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్, గాంధీ మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ

- మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నవతెలంగాణ-కెరమెరి



కెరమెరి : కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, గాంధీ మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జై బాబు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను బుధవారం జోడేఘాట్‌లో ప్రారంభించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులుగా మహాత్మా గాంధీ పదవి బాధ్యతలు స్వీకరించి శతాబ్దం అవుతున్న నేపథ్యంలో బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంలో పార్టీ ప్రతిష్టాత్మకంగా జై బాపూ జై భీం జై సంవిధాన్ అనే కార్యక్రమం తీసుకువచ్చిందని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేయటనికి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర మొదలు పెట్టిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని ఉద్దేశ్యంతోనే నిండు పార్లమెంట్లో కేంద్ర హోం మంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎల్లవేళలా గాంధీజీ, అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తుందన్నారు. గ్రామాల్లోని వివిధ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి మునిర్ అహ్మద్, మండల అధ్యక్షుడు కుసుంరావు, కోఆర్డినేటర్ చునర్కర్ వసంత్ రావ్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు

ఆసిఫాబాద్ : మహాత్మా గాంధీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి వంద సంవత్సరాలు పూర్తైన నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మండలంలోని రహపెల్లి, ఈదులవాడ గ్రామపంచాయతీలలో పార్టీ మండల అధ్యక్షుడు మసాడే చరణ్, మాజీ ఎంపీపీ బాలసుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. గాంధీ మార్గంలో సమ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ బ్లాక్ అధ్యక్షులు దుర్గం దేవాజీ, యూత్ ఉపాధ్యక్షులు శివరాం నాయక్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్, మైనారిటీ అధ్యక్షులు షైక్ అసద్, దీపక్, మాజీ ఎంపీటీసీ సంతోష్, పిడగు తిడుపతి, పెద్దపల్లి సంతోష్, ప్రవీణ్, కృష్ణమూర్తి, అశోక్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మున్సిపాలిటీలోని వార్డుల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతివార్డ్‌లో పాదయాత్రగా తిరుగుతూ ప్రజలకు బాపు, అంబేద్కర్ భావజాలను తెలియజేశారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ చిట్ల సత్యనారాయణ ముఖ్య అతిధిలుగా హాజరై మాట్లాడుతూ బీజేపీ ప్రమాణాలను, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతిని నెలకోల్పుతోందన్నారు. ఈ తరుణంలో శాంతి అహింసలను మూల సూత్రాలుగా బోధించిన మహాత్మాగాంధీ, మనుషులంతా ఒక్కటే అంటూ సమాన హక్కులు కల్పించిన డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ కాంగ్రెస్ అభివృద్ధి చేపడుతోందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, సయ్యద్ హాజీ, రాజు, రవీందర్, సుగుణకర్, గడుసు రవీందర్, రాకేష్, వివిధ వార్డ్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



లక్షెట్టిపేట : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అమ్ముకోవద్దు.. సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ దండే విఠల్

నవతెలంగాణ-బెజ్జూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండలంలోని సలగుపల్లి, బెజ్జూరు, కృష్ణపెల్లి గ్రామాల్లో సన్నబియ్యం కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు సన్నబియ్యం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ పేదల రేషన్ కార్డులు త్వరలో అందజేస్తామని తెలిపారు. సన్న వడ్ల కొనుగోలు చేసి, సన్న రకం బియ్యానికి బోనస్ రూ.500 ఇస్తుందని తెలిపారు. సన్న బియ్యాన్ని రేషన్ కార్డుదారులు అమ్ముకోవద్దని తెలిపారు. సన్న రకం బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ భూమేష్ మాట్లాడుతూ మండలంలో 27 వేల మంది లబ్ధిదారులున్నారని, 13,000 క్వింటాళ్ల ప్రతినెల రేషన్ కార్డుదారులకు బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పుష్పలత, సింగల్ విండో చైర్మన్ ఓం ప్రకాష్, పిసిసి మెంబర్ హర్షద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, ఏట నాగరాజు, మాజీ సర్పంచులు జెగ్గా గౌడ్, పెద్దల సుగుణ, విశ్వేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు నాహీర్ అలీ, సురేష్ గౌడ్, పెంటయ్య, పాల్గొన్నారు.



మహిళల రక్షణ కోసమే షీ టీంలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని, మహిళలు అన్యాయానికి గురైన సమయంలో తమకు సమాచారం అందించాలని షీ టీం ఇన్‌ఛార్జి ఎఎస్ఐ సునీత అన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని ఒక ప్రయివేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు గురైతే వెంటనే షీ టీంలను సంప్రదించాలని సూచించారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంల వినియోగంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తమ వ్యక్తిగత విషయాలను అందులో పోస్ట్ చేయరాదని అన్నారు. అన్యాయానికి గురైతే వెంటనే డయల్ 100కు గానీ లేదా 87126 70565, ఛైల్డ్ హెల్ప్ లైన్ నెం. 1098, సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెం. 1930కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు బి రమాదేవి, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-జైపూర్

10వ తరగతి పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులు సెలవుల్లో ఇంటికి వెళుతున్నందున ఇంటి వద్ద జాగ్రత్తగా మసలుకోవాలని భీమారం ఎస్ఐ శ్వేత సూచించారు. భీమారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో బుధవారం సమావేశమై విద్యార్థినులు సెలవుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. 10వ తరగతి పరీక్షలో పాసైనా.. ఫేలైనా, మార్కులు తక్కువెక్కువ వచ్చినా చింతించవద్దన్నారు. వేసవి సెలవుల్లో తల్లితండ్రులు చెప్పినట్టుగా నడుచుకోవడంతో పాటు ఎలాంటి ఆకర్శనలకు, ప్రేమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండటం మంచిదని, వాటి వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించి బాగా చదివి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

ఉద్యానవన శాఖకు రూ.2.56 లక్షల ఆదాయం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి డివిజన్‌లోని కన్నాల ఉద్యానవనంలోని మామిడి, సరుగుడు చెట్లకు సంబంధించిన వేలంపాటలో రూ.2 లక్షల 56 వేల ఆదాయం వచ్చినట్లు ఉద్యానవన శాఖ అధికారి అర్చన తెలిపారు. బుధవారం జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో మామిడి వ్యాపారి బాబర్ రూ.53 వేలకు మామిడితోటను, సరుగుడు చెట్లను రూ. 2,03,000లకు శ్రీనివాస్ దక్కించుకున్నారు. వేలంపాటలో జిల్లా ఉద్యాన అధికారి అనిత హార్టికల్చర్ ఆఫీసర్ తిరుపతి, వ్యవసాయ అధికారులు ప్రేమ్ కుమార్, అటవీ అధికారి రాథోడ్ శంకర్, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

అదనంగా రూ.10 చెల్లించేందుకు సమ్మతించిన కోలిండియా

నవతెలంగాణ-జైపూర్

కోల్‌మైన్స్ పెన్షన్ నిధిని పటిష్టపర్చడానికి టన్నుకు అదనంగా మరో రూ.10 చొప్పున సమకూర్చేందుకు అంగీకరించింది. ప్రస్తుతం కోలిండియా లిమిటెడ్ ద్వారా టన్ను ఒకింటికి రూ. 10 చొప్పున పెన్షన్ నిధికి జమ చేస్తోంది. ఇప్పటి నుంచి అదనంగా టన్నుకు రూ.10 చొప్పున పెన్షన్ నిధికి జమ చేయడానికి అంగీకరించింది. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లకు సమాచారం అందించింది. కాగా కలకత్తాలో జరిగిన బోర్డు సమావేశంలో ఇతర విషయాలతో పాటు రూ.10 పెంపు నిర్ణయంతో పాటు ఆమోదించినట్లు కోలిండియా వెల్లడించింది. కోల్‌మైన్స్ పెన్షన్ ఫండ్-1998 నిధికి సహకారం కోసం కోలిండియాలోని నియంత్రితేతర రంగాలకు బొగ్గు నోటిఫైడ్ ధరలో ప్రస్తుతం ఉన్న టన్నుకు రూ.10 కాగా అదనంగా మరో రూ.10 మొత్తంగా టన్నుకు రూ.20 నాన్-కోకింగ్‌కు కాగా కోకింగ్ బొగ్గు టన్నుకు రూ.10 అదనంగా జమ చేయనున్నట్లు తెలిపింది. ఇది ఈ నెల 16 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. కోలిండియా మాదిరిగానే సింగరేణి యాజమాన్యం కూడా ప్రతి టన్ను బొగ్గుపై రూ.10 చొప్పున పెన్షన్ ఫండ్ బలోపేతానికి జమ చేయాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు.

వీర హనుమాన్ శోభాయాత్రకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏప్రిల్ 11న జరిగే వీర హనుమాన్ శోభాయాత్రకు అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్‌ను బజరంగ్‌దళ్ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 12న హనుమాన్ జయంతి సందర్భంగా ముందు రోజు శోభాయత్ర నిర్వహించడం జరుగుతుందని, దానికి హాజరు కావడంతో పాటు అనుమతి ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ సభ్యులు రాపర్తి శ్రావణ్, రాపర్తి నరేష్, విపిన్ లోదా, అరవింద్ లోదా, రాపర్తి నవీన్, మెకార్తె కోటేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఐకేపీ వీఓఏలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీనిధి ఇన్సెంటివ్స్ వెంటనే చెల్లించాలని, శ్రీనిధి నుండి రూ.26వేల వేతనం చెల్లించాలని, అర్హులైన వివోఏలను శ్రీనిధి మేనేజర్లుగా, సీసీలుగా నియమించాలని, ట్యాబ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే త్వరలోనే రాష్ట్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భోజన్న, స్వప్న, సంగీత, సంపత్, రజిత, సునీత, లావణ్య, రాజు, విక్రం, అనిల్, శరత్ కుమార్, పవన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం వస్తే చర్యలు

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-జైనూర్

సన్న బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని డీలర్ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలు సైతం సన్న బియ్యం ఉపయోగించుకునేలా పంపిణీ చేస్తోందని తెలిపారు. బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దని, పొరపాట్లు జరిగితే సహించేది లేదని తెలిపారు. కార్డుదారులందరికీ బియ్యం అందించాలని తెలిపారు. అనంతరం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీలర్ డిపో మేజర్ గ్రామపంచాయతీ ఈవో ఆనంద్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మరణించిన ఉపాధ్యాయురాలికి నివాళి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెల్గనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన రమాబిందుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఆమె పాఠశాలకు చేసిన సేవలు కొనియాడుతూ విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

వేసవి నేపథ్యంలో సత్యసాయి ట్రస్ట్ సౌజన్యంతో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం డిపో మేనేజర్ కే.పండరి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులు చల్లని నీటిని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రయాణికుల కోసం సేవా దృక్పథంతో సత్యసాయి ట్రస్ట్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ ఏఆర్‌రెడ్డి, కంట్రోలర్లు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

యునైటెడ్ కెమెరికల్ బ్యాంక్ క్లర్క్ ఉద్యోగానికి ఎంపిక

నవతెలంగాణ-కడెం



మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన గొర్రె విజయ్ అనే యువకుడు యునైటెడ్ కెమెరికల్ బ్యాంక్ క్లర్క్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ఉద్యోగం సాధించడంతో విజయ్ తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు. ఇలాంటి బ్యాంకు ఉద్యోగాలు యువకులు సాధించడానికి మార్గదర్శిగా నిలిచాడని ఆయనను గ్రామస్తులు బంధువులు ఘనంగా సన్మానించారు.

ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు గురు, శుక్రవారాలలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని డీఈఓ రామారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు మెరుగైన బోధన కొరకు ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సన్న బియ్యం పంపిణీతో పేదలకు మేలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-రెబ్బెన

నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని చౌక ధరల దుకాణంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, ప్రజాసంక్షేమంలో భాగంగా పేదవారి కడుపు నింపేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని 314 పౌరసరఫరాల దుకాణాల ద్వారా ప్రతి రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. నేడు, రేపు జిల్లాలో అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యాన్ని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని, గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పంపిణీకి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, పేర్ల తొలగింపులు, చేర్పులు చేసుకోవచ్చని, బియ్యం పంపిణీ సమయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బియ్యం పంపిణీ ప్రక్రియలో ఏదైనా అక్రమాలు చేపడితే సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని, బియ్యం పంపిణీ చేసే పౌరసరఫరాల దుకాణాల వద్ద కార్డుదారులకు నీడ, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ అర్హులైన పేదవారి కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి పండుగ వాతావరణంలో అర్హులైన అందరికీ అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన రేషన్ కార్డుదారులకు కుటుంబంలోని ప్రతి సభ్యుడికి 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తుందని, ప్రతి కార్డుదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, తహసీల్దార్ రామ్మోహన్ రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు రంగు మహేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ నుంచి కాపాడాలి

- వ్యవసాయ కార్మిక సంఘం, గంగపుత్రుల ఆధ్వర్యంలో వినతి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్(డబ్ల్యు) గ్రామానికి చెందిన గంగపుత్ర కులానికి చెందిన వారిని కుల బహిష్కరణ నుంచి కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి, వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యపై స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే తహసీల్దార్‌తో మాట్లాడారు. కుల సంఘంలో లెక్కలు అడిగినందుకు ఈ పది కుటుంబాలను అధ్యక్షుడు కుల బహిష్కరణ చేశాడని, బాధితులు 10 నెలలుగా కలెక్టర్, ఎస్పీని కలిసిన సమస్య పరిష్కారం జరగలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే తాము అధికారుల దృష్టికి తీసుకుపోయాం. మీరు మీ గ్రామంలో మాట్లాడుకోమని చెప్పారని అన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ సమస్య పరిష్కరించకుండా దాట వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్, హెచ్ఆర్పీ సంఘం అధ్యక్షులు సురకంటి ఎల్లారెడ్డి, బాధితులు పుట్టి భీమన్న, పుట్టి ఎర్రన్న పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-సారంగాపూర్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జీ భైంసా మార్కెట్ చైర్మెన్ ఆనంద్‌రావ్ పటేల్ అన్నారు. మండలంలోని బీరవెల్లి గ్రామంలో బుధవారం మహాత్మ గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. 10 సంవత్సరాల పాటు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. మత రాజకీయాలను రెచ్చగొడుతూ అధికారంలో కి వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని అవమానిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, అప్రజాస్వామ్య పాలన సాగిస్తుందని ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ శంకర్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, రాజ్ మహమ్మద్, వెంకటరమణరెడ్డి, నర్సారెడ్డి, నవీన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రాజేశ్వర్, మధుకర్, లక్ష్మణ్, సుభాష్ రెడ్డి, ప్రశాంత్, ముంతాజ్, భోజాగౌడ్, సత్యం, సురేందర్, స త్యాపాల్‌రెడ్డి, చిన్నయ్య, రమేష్, సూర్యం, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా వాహనాలను ఎలా విడిచిపెట్టారు?

నవతెలంగాణ-నేరడిగొండ



అక్రమంగా పశువులను తరలిస్తున్న 4 ఐచర్, 3 బొలెరో వాహనాలలో 3 ఐచర్, 2 బొలెరోలను ఏ చట్టం ప్రకారం విడిచిపెట్టారో నేరడిగొండ ఎస్సై, ఇచ్చోడ సీఐ సమాధానం చెప్పాలని గుడిహత్నూర్ మాజీ జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయం వద్ద హిందూ సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం అక్రమంగా పశు వులను తరలిస్తున్నారని, హిందూ సంఘాల నాయకులకు సమాచారం అందడంతో వారు స్థానిక ఎస్సైకి సమాచారం అందించినా వారు స్పందించలేదన్నారు. మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసుల సహాయంతో అట్టి వాహనాలను ఆపడం జరిగిందని అన్నారు. అనంతరం ఎస్సైకి మరోమారు హిందూ సంఘాల నాయకులు ఫోన్ చేసిన స్పందించక పోవడంతో పోలీసులతో ఎస్సైకి సమాచారం అందించారు. కొంతసేపటి తర్వాత ఎస్సై రావడంతో ఆయనతో హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆ వాహనాలలో మోతాదుకు మించిన పశువులు ఉన్నాయని, తప్పుడు కాగితాలు ఉన్నాయని, ఎస్సైకి ఫిర్యాదు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారని అన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్సై తర్వాత వాటిని వదిలిపెట్టి రెండు రోజుల తర్వాత హిందూ యువకులపై తప్పుడు కేసులు బనాయించారని అన్నారు. ఏ రకంగా ఆ వాహనాలను విడిచిపెట్టారో ఎస్సై, సీఐలను అడిగితే మాటను దాటవేస్తున్నారే తప్ప జవాబు ఇవ్వడం లేదన్నారు. ఏ విధంగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను విడిచిపెట్టారో చెప్పాలని, లేనియెడల 4 రోజుల తర్వాత హిందూ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ వాహిని, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

150 గ్రాముల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలో కేంద్రంలో 150 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలో ఇద్దరు వ్యక్తులు నేరడిగొండ వైపు నుంచి నిర్మల్ వైపు గంజాయి తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి గస్తీ చేసి వెంబడించగా బంధం ఎక్స్ రోడ్ వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద 150 గ్రాముల గంజాయి దొరికిందని తెలిపారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తులు ఎవరని ఆరా తీయగా మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన షేక్ మజార్(29)గా గుర్తించారు. మరొకరు నిర్మల్‌కు చెందిన షేక్ ఇమ్రాన్(29)గా గుర్తించినట్టు తెలిపారు. వీరు ఈ గంజాయిని ఎక్కడ నుంచి తీసుకున్నారని అడగగా నేరడిగొండ మండలం ధన్నూర్(బి) గ్రామస్తుడు కటారే బారసింగ్(37) నుంచి తీసుకున్నట్టు తెలిపారు. గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై తెలిపారు.